క్లుప్తంగా

ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయండి

పీడీ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా



మచిలీపట్నంటౌన్: ఎఫ్ఆర్ఎస్ విధానాన్ని రద్దు చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ సేవలు అందించేందుకు తప్పనిసరి చేసిన ముఖ గుర్తింపు విధానం (ఎఫ్ఆర్ఎస్)ను రద్దు చేయాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం స్థానిక పోర్ట్ రోడ్డులోని పీడీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు మాట్లాడుతూ ఈ విధానంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. సర్వర్ పని చేయక ఎఫ్ఆర్ఎస్ పడక సమయం వృథా అవుతుండటంతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలపై వేధింపులను నివారించేందుకు అధికారులు స్పందించాలని కోరారు. తమ డిమాండ్లు పరిష్కారమయ్యే వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రమాదేవి, సీఐటీయూ నేత సుబ్రహ్మణ్యం, మచిలీపట్నం ప్రాజెక్టు అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం అధ్యక్షురాలు సీహెచ్ నాంచారమ్మ, కార్యదర్శి రెజీనారాణి, సెక్టర్ నాయకురాలు లక్ష్మి, సీతారత్నం, విజయశ్రీ, సుజాత, సౌజన్య, స్వాతి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం కాల్వలో పడి వ్యక్తి గల్లంతు



పాయకాపురం(విజయవాడరూరల్): పాతపాడు గ్రామం వద్ద పోలవరం కాల్వలో కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్ళిన వ్యక్తి కాలుజారి కాల్వలో కొట్టుకెళ్ళినట్లు వచ్చిన ఫిర్యాదుపై నున్న పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ప్రకాష్‌నగర్ కు చెందిన పత్తివాడ మధుసూదన్ (26) క్యాటరింగ్ పనులు చేస్తుంటాడు. ఆదివారం తన స్నేహితులతో కలిసి పాతపాడు గ్రామం వెళ్లారు. స్నేహితులతో మద్యం సేవించిన తర్వాత కాలకృత్యాలు తీర్చుకునే క్రమంలో పోలవరం కాల్వలో పడి కొట్టుకెళ్లిన మధుసూదన్ కోసం గాలించినా ఆచూకీ దొరకలేదని మధుసూదన్ తండ్రి రామకృష్ణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుల ఉక్కిరిబిక్కిరి!

- బోధనేతర పనులతో సతమతం
- మమ్మల్ని పాఠాలు చెప్పుకోనీయండి
- వాట్సాప్ గ్రూపుల్లో ఉపాధ్యాయులు ఆవేదన
- టెన్షన్ టెన్షన్‌గా స్కూళ్లకు వెళ్తున్న వైనం

పెడన: బోధనేతర పనులతో ఉపాధ్యాయులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు పాఠాలు చెప్పి వారిని ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించాలి. గతంలో మాట ఇది. ప్రస్తుతం బోధనేతర పనులతో సతమతమవుతున్నారు. 'తమ పిల్లలకు పాఠాలు చెప్పుకోనీయండి' అంటూ వాట్సాప్ గ్రూపుల్లో ఉపాధ్యాయుల ఆవేదన వ్యక్తం చేస్తున్న మెసేజ్‌లు హల్‌చల్ చేస్తున్నాయి. త్వరలో ఉపాధ్యాయులు ఎన్డీయే కూటమి సర్కారు ప్రవేశపెడుతున్న యాప్‌లు, ఆన్‌లైన్ వర్క్‌లు, ఇతర బోధనేతర కార్యక్రమాలకు వ్యతిరేకంగా రోడ్డెక్కే పరిస్థితి స్పష్టంగా కనపడుతోందని చెప్పకనే చెబుతున్నారు. అయితే ఎవరూ బహిరంగంగా చెప్పడానికి, మీడియా ముందు మాట్లాడటానికి భయపడుతున్నారు. మనకెందుకులే అని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం పాఠశాలలో ఉపాధ్యాయుల పరిస్థితి ఎలా ఉందో వారి వాట్సాప్ గ్రూపుల్లో ఫార్వర్డ్ అయిన మెసేజ్‌లో వివరాలను పరిశీలిస్తే తెలుస్తుంది



👉 త్వరలో ఉపాధ్యాయులు యాప్‌లు, online వర్క్ ఇతర బోధనేతర కార్యక్రమాలకు వ్యతిరేకంగా రోడ్డెక్కే పరిస్థితి స్పష్టంగా కనబడుతుంది.

👉 పోయిన వారం మెగా పేరెంట్స్ మీటింగ్ జరిగితే దానికి సంబంధించిన అన్ని అంశాలను ఆన్లైన్ లో ఎంటర్ చేయడానికి ఒక రోజుకు పైగా పట్టింది.

👉 నిన్నంతా స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర యాప్ విసిగించింది. అందులో ఫోటోలు ఎంత ప్రయత్నించినా upload కాలేదు.

👉 ఈవారం పిల్లలకు పుస్తకాలు, బ్యాగులు ఇచ్చినందుకు వాళ్ళ తల్లిదండ్రుల దగ్గర పిల్లల దగ్గర బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకోవాలి. అదో పెద్ద ప్రహసనం.

👉 ఇక 20 వ తేదీ లోగా I got karma


వాట్సాప్ గ్రూపులో వచ్చిన ఉపాధ్యాయుల ఆవేదన సారాంశం

స్కూలు పునః ప్రారంభం నుంచే బోధనేతర పనులు

విద్యార్థులకు కిట్లు పంపిణీ, వాటి వివరాలను నమోదు చేసుకోవడంతో పాటు ఆన్‌లైన్ చేశారు. ఆ తరువాత మెగా పేరంట్స్ సమావేశం. దీనికి సంబంధించిన అన్ని అంశాలను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేయడం. స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర యాప్. పాఠశాలలో పరిసరాల పరిస్థితిని ఫొటోలు తీసి ఈ యాప్‌లో అప్‌లోడ్ చేయడానికి ఎంత ప్రయత్నించినా కాలేదు. ఒక పక్క అప్‌లోడ్ చేయకపోతే ఎందుకు చేయలేదంటూ ఫోన్లు. మరోవైపు అప్‌లోడ్ చేస్తూనే ఉండాల్సిన దుస్థితి ఏర్పడుతోందిది. తాజాగా విద్యార్థులకు అందజేసిన కిట్లు. పుస్తకాలు, బ్యాగులు ఇచ్చినందుకు వాళ్ల తల్లిదండ్రులు, పిల్లల వద్ద బయోమెట్రిక్ అటెండెన్స్ తీసుకోవాలి. వీటిని మళ్లీ యాప్‌లో అప్‌లోడ్ చేయడం వంటి పనులు చేయాల్సి ఉంది.

యాప్‌లో 18 కోర్సులు

ఐ గాట్ కర్మయోగి అనే యాప్‌లో 18 కోర్సులను పూర్తి చేయాల్సి ఉంది. ఈ నెల 28 నుంచి లీడర్‌షిప్ ట్రైనింగ్. సెకండ్ స్పెల్ ట్రైనింగ్‌కు హాజరుకావాల్సి ఉంది. ఇక స్థానికంగా మండల స్థాయిలో హెచ్ఎంలు, ఎంఈవోలు గంటల తరబడి సమావేశాలు వినాల్సి వస్తోంది. అదీ కాకుండా ఈ ఏడాది కొత్తగా ఎగ్జామ్స్‌లో పిల్లవాడు రాసిన ఆన్సర్ షీట్స్‌ను ఫొటో తీసి లీప్ యాప్‌లో అప్లోడ్ చేయాలని ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో హైస్కూల్ టీచర్లు 500 నుంచి 1000 వరకు ఫొటోలను అప్లోడ్ చేయాల్సి ఉంది. ఇవి ఎప్పటికి అప్‌లోడ్ అవుతాయో.. కావో తెలియని దుస్థితి. ఈ టార్చర్ మామూలుగా ఉండదని ఉపాధ్యాయులు వాపోతున్నారు.



ప్రభుత్వం మారిన తర్వాత ముఖ్యంగా లోకేష్ విద్యాశాఖ మంత్రి అయిన తర్వాత ఉపాధ్యాయులకు బోధన తప్ప ఇతర కార్యక్రమాలుండవని అనుకున్నామని, కానీ బోధనేతర కార్యక్రమాలు ఇంకా పెరిగాయని వాట్సాప్ గ్రూపుల్లో ఆవేదన వెలిబుచ్చుతున్నారు. విద్యాశాఖ మంత్రి గత కొద్ది నెలలుగా ఉపాధ్యాయ సంఘాలతో ఎలాంటి సమావేశం నిర్వహించ లేదు. అధికారులతో ఉపాధ్యాయ సంఘాలు సమావేశమైనా ఎలాంటి ఉపయోగం ఉండదని, ఇప్పటికైనా విద్యాశాఖా మంత్రి ఉపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయ సంఘాలతో సమావేశాన్ని నిర్వహించాలని డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే ప్రభుత్వం ఉపాధ్యాయుల నుంచి తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి ఉంటుందని వాట్సాప్ గ్రూపుల్లో పేర్కోవడం విశేషం.

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి జన్మదిన వేడుకలు



కోడూరులో జన్మదిన కేక్‌ను కట్ చేస్తున్న రమేష్‌బాబు, పక్కన నాయకులు

కోడూరు: వైఎస్సార్ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు జన్మదిన వేడుకలను మండల పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం రమేష్‌బాబు జన్మదినం కావడంతో సోమవారం పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయనతో పార్టీ నేతలు కేక్ కట్ చేయించారు. రమేష్‌బాబుకు నేతలు, అభిమానులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. రమేష్‌బాబు ఎమ్మెల్యేగా ఉండగా నియోజకవర్గ ప్రజలకు చేసిన మంచిని, అభివృద్ధి కార్యక్రమాలను పార్టీ నేతలు వివరించారు. పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యన్నారాయణ, పార్టీ రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీరవెంకట నారాయణరావు, ఎంపీటీసీ బడే గంగాధరరావు, ఎస్సీసెల్ నియోజకవర్గ కన్వీనర్ వెన్నా ప్రసాద్, ఉపసర్పంచి ఇంకొల్లు మురళీకృష్ణ, కోట సుబ్రహ్మణ్యం, చిలకలపూడి ధర్మయ్య, గ్రామ కన్వీనర్లు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికురాలు అందరికీ స్ఫూర్తి



హేమలతను సన్మానిస్తున్న పి.సాయిబాబు, ఎంపీడీవో ఎ.వి.రమణ, ఇతర అధికారులు

చల్లపల్లి: మండల పరిధిలోని పురిటిగడ్డ పాఠశాలలో పారిశుద్ధ్య కార్మికురాలిగా పనిచేస్తున్న పల్లెకొండ హేమలత అదే గ్రామానికి చెందిన వృద్ధురాలు చిర్ల కనికరమ్మను దత్తత దీసుకుని ఆమెకు అవసరమైన నిత్యావసర వస్తువులు అందిస్తోంది. హేమలతను సోమవారం నియోజకవర్గ ప్రత్యేక అధికారి సాయిబాబు, ఎంపీడీవో ఎ.వి.రమణ, ఎంఈవో-2 పి.వెంకటేశ్వరరావు, సర్పంచ్ ఎం.రమ్య ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పంచాయతీ ఈవో శైలజ, ఎంపీటీసీ సభ్యురాలు ఆర్.అంకమ్మ, ఉపాధ్యాయులు దేవరపల్లి సురేష్‌బాబు, బి.నాగలక్ష్మి, గ్రామ ప్రముఖులు రిటైర్డ్ ఆర్టీవో నాదెళ్ల శివరామకృష్ణ, సచివాలయ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

చట్టపరిధిలో సమస్యలకు పరిష్కారం

కృష్ణా ఎస్పీ గంగాధరరావు



మీ కోసంలో బాధితుల సమస్యలు ఆలకిస్తున్న ఎస్పీ గంగాధరరావు

కోనేరుసెంటర్: మీ కోసంలో అందిన అర్జీలను చట్ట పరిధిలో విచారణ జరిపించి బాధితులకు సత్వర న్యాయం అందడానికి చర్యలు తీసుకుంటామని కృష్ణా ఎస్పీ ఆర్. గంగాధరరావు పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన మీ కోసంలో ఆయన పాల్గొన్నారు.

వివిధ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల నుంచి అర్జీలు అందుకున్నారు. పలు అర్జీలను అక్కడికక్కడే పరిష్కరించారు. మరికొన్ని అర్జీలను సంబంధిత అధికారులకు సిఫార్సు చేసి వెంటనే వాటిని పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాధితులకు ఎలాంటి సమస్య ఉన్నా ధైర్యంగా మీకోసంలో ఫిర్యాదు చేయవచ్చునన్నారు. ఫిర్యాదు ఎలాంటిదైనా విచారణ జరిపించి బాధితులకు అన్యాయం జరగకుండా చూస్తామని తెలిపారు.

ఫిర్యాదుల్లో కొన్ని

- తోట్లవల్లూరుకు చెందిన ప్రత్యూష అనే బాధితురాలు ఎస్పీని కలిసి తన భర్త ఏడాది క్రితం క్యాన్సర్ వ్యాధితో మరణించినట్లు తెలిపింది. తనకు ఇద్దరు పిల్లలు ఉండగా భర్త చనిపోయిన నాటి నుంచి అత్తమామలు తనతో పాటు తన పిల్లలను ఇంటి నుంచి గెంటేసినట్లు చెప్పారు. జరిగిన అన్యాయంపై పెద్దలతో మాట్లాడించినా అత్తమామలు, ఆడపడుచు తమను చంపేందుకు ప్రయత్నిస్తున్నారని వారి నుంచి రక్షణ కల్పించి న్యాయం చేయాలని ప్రాధేయపడింది.
- గుడివాడకు చెందిన మురళీ అనే ఓ తండ్రి ఎస్పీని కలిసి తన కుమార్తెను కొందరు సామాజిక మాధ్యమాల్లో అల్లరి చేస్తూ పోస్టింగ్‌లు పెడుతున్నారంటూ వాపోయారు. ఆమెను మానసికంగా వేధిస్తూ అవమానిస్తున్నారని వారిపై చర్యలు తీసుకుని తన బిడ్డకు రక్షణ కల్పించాలని కోరారు.
- కంకిపాడుకు చెందిన రవి ప్రైవేట్ ఉద్యోగి. రెండు నెలల క్రితం సోషల్‌మీడియాలో ఉద్యోగ అవకాశాలు ఉన్నట్లు కనిపించగా సంబంధిత వ్యక్తులతో మాట్లాడి ప్రాసెసింగ్ ఫీజు కింద లక్ష రూపాయలు ఇచ్చినట్లు ఆయను చెప్పారు. ఇంత వరకు వారి నుంచి సమాధానం రావడం లేదని తనకు న్యాయం చేయాలని కోరారు. అర్జీలపై స్పందించిన ఎస్పీ విచారణ జరిపించి బాధితులకు న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చారు.

పోలీస్ గ్రీవెన్స్‌కు 72 ఫిర్యాదులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్‌కు 72 ఫిర్యాదులు అందాయి. పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు ఆదేశాల మేరకు డెప్యూటీ పోలీస్ కమిషనర్ ఏబీటీఎస్ ఉదయరాణి ప్రజల నుంచి ఫిర్యాదు స్వీకరించారు. వాటి పరిష్కారానికి సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో మాట్లాడారు. వికలాంగులు, వృద్ధుల వద్దకు ఆమె వెళ్లి సమస్యను తెలుసుకుని ఫిర్యాదును తీసుకున్నారు.

అంతర్రాష్ట్ర బైక్ దొంగల అరెస్ట్

- రూ.6.50 లక్షల విలువైన 14 బైక్‌లు స్వాధీనం
- మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించిన డీఎస్పీ



దొంగల నుంచి స్వాధీనం చేసుకున్న బైక్‌లు

గుడివాడరూరల్: అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 6.50లక్షల విలువైన 14 బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వి. దీరజ్ వినీల్ తెలిపారు. స్థానిక వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం డీఎస్పీ మీడియాతో మాట్లాడారు. ఎస్పీ ఆర్.గంగాధరరావు ఆదేశాల మేరకు, వచ్చిన సమాచారం మేరకు సీఐ కొండపల్లి శ్రీనివాస్, ఎస్ఐ గౌతమ్‌కుమార్ సిబ్బందితో టీంలుగా ఏలూరురోడ్డులో వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఆ సమయంలో ద్విచక్ర వాహనాలపై వచ్చిన కోరదల యేసు, చిలకంటి రంగారావు.. వారి బైక్‌లను తిప్పుకుని పారిపోవడానికి ప్రయత్నించగా వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారన్నారు. దీనిలో14 బైక్‌లను వివిధ ప్రాంతాల్లో తాకట్టు పెట్టినట్లు తెలుసుకుని వాటిని స్వాధీనం చేసుకున్నామని ఎస్పీ వివరించారు. దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుల్లో ఒకరు ఆటోడ్రైవర్, మరొకరు తాపీమేస్త్రీ అని తెలిపారు. ఆటస్థలాలు, ఆస్పత్రులు, ఇళ్ల వద్ద పార్కింగ్ చేసిన బైక్‌లను మారు తాళాలతో దొంగతనాలు చేస్తున్నట్లు విచారణలో నిందితులు అంగీకరించారన్నారు. ఏలూరు, గుంటూరు, ప్రకాశం, కృష్ణా జిల్లాల్లో ఎక్కువగా బైక్‌లను చోరీలు చేసినట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చనున్నట్లు డీఎస్పీ వివరించారు. దొంగలను పట్టుకున్న సీఐ శ్రీనివాస్, ఎస్ఐ గౌతమ్, కానిస్టేబుళ్లు సురేంద్రబాబు, వేణుగోపాల్, మురళీకృష్ణ, సత్యనారాయణను డీఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

కాపులను విస్మరిస్తున్న 'కూటమి'

- ఇచ్చిన హామీలు గాలికొదిలేశారు
- కాపునాడు జిల్లా కన్వీనర్ వి.వి.రమణమూర్తి

చిలకలపూడి(మచిలీపట్నం): కూటమి ప్రభుత్వం కాపు సామాజిక వర్గాన్ని విస్మరిస్తోందని కాపునాడు జిల్లా కన్వీనర్ విన్నకోట వెంకటరమణమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 14 నెలలు కావస్తున్నా ఎన్నికలు ముందు 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికి రూ. 3 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీని తుంగలోకి తొక్కారని పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని చెప్పిన నాయకులు ఆ దిశగా అడుగులు పడటం లేదన్నారు. మచిలీపట్నం నగరంలో ఈ నెల 16వ తేదీన జాబ్‌మేళా నిర్వహించి నగరంలోని పలు షాపుల్లో ఉద్యోగాలు ఇప్పించి వేల మందికి ఉద్యోగాలు కల్పించామని కూటమి నాయకులు గొప్పలు చెప్పుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో నగరపాలక సంస్థ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి తమ సామాజికవర్గం బుద్ధి చెబుతుందని హెచ్చరించారు. రెడ్‌బుక్ పేరుతో అమాయకులను వేధిస్తూ అక్రమంగా కేసులు కడుతున్నారని తెలిపారు. ఎన్నికల ముందు కాపు సామాజికవర్గంపై ఎంతో ప్రేమ ఒలకపోసి అధికారంలోకి వచ్చిన అనంతరం వారిని వదిలేశారని ధ్వజమెత్తారు. ఎంతో మంది పేద కుటుంబాలను, చిరువ్యాపారులను రోడ్డున పడేశారని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే ఎన్నికల్లో తమ సామాజిక వర్గంతో పాటు పేద, బడుగు, బలహీనవర్గాల వారు కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెబుతారని ఆయన హెచ్చరించారు.

రిక్షాను ఢీకొని బైకిస్టుకు గాయాలు



చల్లపల్లి: రిక్షా బైకు ఢీకొని బైకిస్టుకి గాయాలైన ఘటన మండల పరిధిలోని లక్ష్మీపురం కేసీపీ చక్కెర కర్మాగారం వద్ద చల్లపల్లి- మచిలీపట్నం ప్రధాన రహదారిపై సోమవారం రాత్రి చోటుచేసుకుంది. లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని రామానగరానికి చెందిన దాసరి రాము బైక్‌పై వస్తూ రిక్షాను ఢీకొట్టాడు. రోడ్డుమీద పడటంతో తలకు బలమైన గాయమైంది. చల్లపల్లి 108 ఈఎంటీ దాసి బసవరాజు, పైలెట్ షఫీలు ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన రాము అపస్మారక స్థితిలో ఉడటంతో వెంటనే అతన్ని మచిలీపట్నం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి చేతివాటం!

- భారీ మొత్తంలో నాగాయలంక మండల పరిషత్ నిధులు గల్లంతు
- లెక్కలు తేలలేదు రికార్డుల వెరిఫికేషన్ జరుగుతుంది: ఎంపీడీఓ

నాగాయలంక: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిధులు లక్షల్లో గల్లంతు కావడంపై అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. నిధులు గోల్‌మాల్ తంతు ఐదారు రోజులు క్రితం బయటకు పొక్కడంతో గట్టు చప్పుడు కాకుండా ఈ వ్యవహారంపై మంతనాలు సాగిస్తున్నారు. మండల పరిషత్‌లో భారీగా నిధులు స్వాహా జరిగిందంటూ పబ్లిక్‌లో ప్రచారం గుప్పుమనడంతో సర్వత్రా ఆందోళన నెలకొంది.

అందుబాటులో లేని ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి

2012 నుంచి ఔట్‌సోర్సింగ్‌లో టెక్నికల్ ఉద్యోగిగా పనిచేస్తున్న ఓ యువకుడు గత ఏడాది ఆర్థిక సంవత్సరంలో టెక్నికల్ చేతివాటంతో లక్షల్లో సొమ్ము కొలగొట్టినట్లు అధికారులు గుర్తించారు. నాగాయలంక మినహా మండలంలోని గ్రామ కార్యదర్శులు తమ వర్క్‌లు చేయించుకునేందుకు అదనంగా నెలకు వెయ్యి చొప్పున ప్రైవేటు వేతనం కూడా ఇస్తున్నట్లు సమాచారం ఉంది. సదరు ఉద్యోగి రూ.60 నుంచి 70లక్షలు మేరకు చేతివాటంతో నొక్కేసాడని, ప్రస్తుతం అధికార యంత్రానికి అందుబాటులో లేకుండాపోయాడని తెలిసింది.

నిధులు గల్లంతు వాస్తవమే..

మండల పరిషత్‌లో సొమ్ము గల్లంతుపై నాగాయలంక ఎంపీడీఓ (ఎఫ్ఏసీ) సుధా ప్రవీణ్‌ను సోమవారం వివరణ కోరగా నిధులు గల్లంతు వాస్తవమేనని ఆయన అంగీకరించారు. గత ఆర్థిక సంవత్సర కాలంగా ఈ నిధులు గల్లంతుపై సంబంధిత రికార్డులను పూర్తి స్థాయిలో వెరిఫికేషన్ చేపట్టామని చెప్పారు. ప్రస్తుతం ఎంత అనేది లెక్కలు తేలలేదని అయితే బహిరంగ ప్రచారంలో ఉన్నట్లు రూ.70 లక్షలు కాకపోయినా భారీ మొత్తంలోనే లెక్క తేలే అవకాశం ఉందని ఇప్పటికి ఇంతకంటే వివరాలు అందించలేమని ఎంపీడీఓ తెలిపారు. అయితే మండలంలోని కార్యదర్శులు తమ పంచాయతీల్లో టెక్నికల్ పనులు చేయించుకునే నిమిత్తం ఒక్కొక్కరు నెలకు రూ.వెయ్యి చొప్పున ఇస్తున్నది నిజమేనని ఈఓపీఆర్డీ (ఇన్‌చార్జి) జరుగు పవన్‌కుమార్ అన్నారు.

సీసీ కెమెరాలు అలర్ట్.. దొంగలు పరార్



పెడనలో బడ్డీకొట్టులోకి ప్రవేశించి సీసీ కెమెరాలకు చిక్కిన దొంగలు

పెడన: పట్టణంలో ఆదివారం అర్ధరాత్రి సుమారు 2.15 గంటల ప్రాంతంలో మెయిన్‌రోడ్డులోని ఒక బడ్డీకొట్టులో ఇద్దరు దొంగలు చోరీకి యత్నించి సీసీ కెమెరాలు అలర్ట్‌తో పరారైన సంఘటన పెడన పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సేకరించిన వివరాల మేరకు పట్టణంలోని పెడన శాఖ గ్రంథాలయానికి వెళ్లే దారిలో మెయిన్ రోడ్డు పక్కన భోగాది కమలప్రసాద్‌కు చెందిన (మాస్టారు)కిళ్లి షాపునకు ఆధునిక సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఆదివారం అర్ధరాత్రి సుమారు 2.12 గంటలకు గుర్తు తెలియని ఇద్దరు దొంగలు బడ్డీకొట్టు వద్దకు ప్రవేశించి తాళాలను తీసేందుకు ప్రయత్నించారు. ఈ లోగా సీసీ కెమెరా అలర్ట్ కావడంతో పాటు వచ్చిన వారిని ఫ్లాష్‌తో ఫొటోలు తీసి యాజమానిని అలర్ట్ చేసింది. ఎప్పుడైతే సీసీ కెమెరా ఫొటోలు తీసిందో దొంగలు ముఖాలను చేతులతో కప్పుకొని పరారయ్యారు. ఈ విషయం వాట్సాప్ గ్రూపుల్లో హల్‌చల్ చేయడంతో సీసీఎస్ పోలీసులు, పెడన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేంద్రప్రసాద్, ఎస్ఐ సత్యనారాయణ జరిగిన సంఘటనపై ఆరా తీశారు. యాజమాని కుమారుడు రాజు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దొంగలను పట్టుకునే పనిలో పడ్డారు.

పంట కాల్వలోకి దూసుకెళ్లిన బూడిద లారీ



ఇబ్రహీంపట్నం ఖిల్లా రోడ్డులో పంట కాల్వలోకి దూసుకెళ్లిన లారీని తొలగిస్తున్న జేసీబీ, పొక్లయిన్

ఇబ్రహీంపట్నం: బూడిద చెరువు నుంచి బూడిద లోడింగ్‌తో వస్తున్న లారీ అదుపుతప్పి ఖిల్లా రోడ్డు పక్కన పంట కాల్వలోకి సోమవారం దూసుకెళ్లింది. అతివేగమే ప్రమాదానికి కారణమని ఆ ప్రాంతవాసులు చెబుతున్నారు. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అతివేగంతో ప్రమాదానికి గురైంది. నిమ్రా, నోవా కళాశాలల విద్యార్థులతో నిత్యం రద్దీగా ఉండే రోడ్డులో వర్షం కారణంగా ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పినట్లు అయింది. ఖిల్లా రోడ్డులో బూడిద రవాణా లారీల రద్దీతో ప్రజలు, కళాశాల విద్యార్థులు, కొండపల్లి ఖిల్లా పర్యాటకులు ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ఆరోడ్డులో ప్రయాణించాల్సి వస్తోంది. లారీలు అతివేగానికి కళ్లెం వేయాలని పలుమార్లు ఎన్టీటీపీఎస్ అధికారులకు ప్రజలు చెప్పినా వారు స్పందించక లారీల వేగాన్ని నియంత్రించే వారు కరువైయ్యారు. ఎట్టకేలకు రెండు జేసీబీలు, ఒక పొక్లెయిన్‌తో వాహనాన్ని అక్కడి నుంచి తొలగించారు.

సారె తెచ్చి.. కనులారా దర్శించి



ఆరో అంతస్తులో అమ్మవారి ఉత్సవమూర్తి



సారె సమర్పిస్తున్న సెక్యూరిటీ సిబ్బంది

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): ఆషాఢ మాసం పురస్కరించుకుని ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు సోమవారం సారెను సమర్పించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ఆలయానికి విచ్చేసిన భక్తులతో ఇంద్రకీలాద్రి కళకళలాడింది. దుర్గగుడిలో సెక్యూరిటీ విధులు నిర్వహిస్తున్న ఎజైల్ సెక్యూరిటీ సర్వీసెస్ సిబ్బంది సోమవారం అమ్మవారికి సారెను సమర్పించారు. జమ్మిదొడ్డి ఆవరణలోని రావిచెట్టు వద్ద అమ్మవారి ఉత్సవ మూర్తికి పూజా కార్యక్రమాలు చేశారు. ఈవో శీనానాయక్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఏఈవోలు చంద్రశేఖర్, ఎన్.రమేష్‌బాబు అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు.

మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ

మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకున్న సిబ్బంది అమ్మవారికి సారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మూలవిరాట్‌ను దర్శించుకున్న అనంతరం ఆరో అంతస్తులో ఉత్సవమూర్తికి సారెను సమర్పించారు.

24తో ముగియనున్న ఆషాఢ ధుత్సవాలు

ఈ నెల 24వ తేదీతో ఆషాఢ మాసోత్సవాలు ముగియనున్నాయి. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారికి సారెను సమర్పిస్తున్నారు. మంగళవారం ఆలయ అన్నదాన విభాగం, శానిటేషన్ విభాగం వేర్వేరుగా అమ్మవారికి సారెను సమర్పించనున్నారు.



క్లుప్తంగా

వైస్ ఎంపీపీకి సన్మానం



నాగాయలంక: ఇటీవల జరిగిన ఉప ఎన్నికలో నాగాయలంక మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఎదురుమొండి ఎంపీటీసీ సభ్యుడు మోకా నాగప్రసాద్‌ను సోమవారం వైఎస్సార్ సీపీ రాష్ట్ర బీసీ సెల్ జాయింట్ సెక్రటరీ చెన్ను రంగారావు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న విధానాలకు అనుగుణంగా ప్రజా సేవలో పేదలకు అండగా పనిచేయాలని కోరుతూ ప్రసాద్‌ను అభినందించారు.

పేదరిక నిర్మూలనకే పీ4



మోపిదేవి: పేదరిక నిర్మూలనకే రాష్ట్ర ప్రభుత్వం పీ4 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఉపాధి హామీ పథకం ఏపీవో ముత్యాలు అన్నారు. మండలంలోని నాగాయితిప్ప, మోపిదేవిలంక గ్రామాల్లో పీ4 గ్రామసభలు ఆయా గ్రామ సర్పంచ్‌లు గరికిపాటి వెంకటేశ్వరావు, మోర్ల జ్యోత్స్న అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. నాగాయితిప్పలో 80 కుటుంబాలను గుర్తించినట్లు గ్రామ కార్యదర్శి రమణ తెలిపారు. మోపిదేవిలంక గ్రామంలో 51 పేద కుటుంబాలను గుర్తించినట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా నాగాయితిప్ప గ్రామ సచివాలయానికి బదిలీపై వచ్చిన ఉద్యోగులను సన్మానించారు. ఉపాధి హామీ పథకం టీఏ భాగ్యలక్ష్మి, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి మోర్ల శ్రీనివాసరావు, పీఏసీఎస్ మాజీ చైర్ పర్సన్ గరికిపాటి గోవిందరాజులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ చిట్టిమోతు నాగార్జున, ఆరోగ్య శాఖ అధికారి జిన్నాబత్తిన రేఖ, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన ఈద్గా



గూడూరు: గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు గూడూరు ఈద్గా కూలిపోయింది. గ్రామ శివార్లలోని పంట పొలాల్లో ఉన్న ఈద్గాలో ముస్లింలు రంజాన్, బక్రీద్ పర్వదినాలలో ఈద్ నమాజులు ఆచరిస్తారు. అయితే వర్షాలకు ఈద్గా కూలిపోవడం దిగ్భ్రాంతికి గురిచేసింది. చుట్టూ పంట పొలాలు ఉండటం, వర్షానికి తోడు ఈదురుగాలులు వీచడంతో ఈద్గా కూలిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి ఈద్గా పునఃనిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని స్థానిక ముస్లింలు విజ్ఞప్తి చేస్తున్నారు.

పథకాల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం

'బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ'లో మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు



కార్యకర్తల నుద్దేశించి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: 'సూపర్‌సిక్స్' పథకాలతో చంద్రబాబు అన్ని వర్గాల ప్రజలను వంచించారని వైఎస్సార్‌సీపీ అవనిగడ్డ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు మండిపడ్డారు. సోమవారం కోడూరులోని దానాశక్తి ఆర్యవైశ్య ప్రార్థనా మందిరంలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న మోసాలను వివరిస్తూ నిర్వహిస్తున్న 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ' అంశంపై రమేష్‌బాబు కార్యకర్తలకు వివరించారు. అధికారంలో రాగానే హామీలన్నీ అమలు చేస్తామని చెప్పిన కూటమి నేతలు, అధికారంలోకి వచ్చి 13 నెలలు గడుస్తున్నా వాటిని అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని అన్నారు. ప్రజలకు ఏమి చేశారని 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో జనాల్లోకి వెళ్తున్నారని ప్రశ్నించారు. తల్లికి వందనంలో ఇంకా ఎనిమిది వేల కోట్ల నగదును జమ చేయలేదని విమర్శించారు. అర్హులకు పెన్షన్లు ఇవ్వటం లేదన్నారు.

రైతులను నిండా ముంచిన కూటమి..

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అన్నదాతలు నిండా మునిగిపోయారని రమేష్‌బాబు విమర్శించారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా కల్లంలోనే ధాన్యం బస్తాను రూ.2200లకు విక్రయించిన రైతులు నేడు రూ.1600లకు విక్రయించడం గగనంగా మారిందన్నారు. ధాన్యం, మినుముకు ధర లేదన్నారు. 17,860 ఎకరాల భూమిని టీడీపీ ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చితే, ఆ భూములను నిషేధిత జాబితా నుంచి జగన్‌మోహన్‌రెడ్డి తొలగించారని చెప్పారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చంద్రబాబు రైతులను మోసం చేస్తూ మళ్లీ ఈ భూములను బడాబాబుల చేతుల్లో పెట్టేందుకు నిషేధిత జాబితాలోకి చేర్చడం సిగ్గుచేటని మండిపడ్డారు.

బుద్ధప్రసాద్ చేసిందేమి లేదు..

అవనిగడ్డ నియోజకవర్గానికి మండలి బుద్ధప్రసాద్ చేసిందేమి లేదని రమేష్‌బాబు విమర్శించారు. అధికారంలోకి రాగానే రూ.800 కోట్లతో రోడ్లు వేశామంటూ గొప్పలు చెప్పుతున్న బుద్ధప్రసాద్, ఆ రోడ్లు ఎక్కడ వేశారో చెప్పాలని ప్రశ్నించారు. వైఎస్సార్ సీపీ అధికారంలో ఉండగా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించిన కోడూరు– అవనిగడ్డ ప్రధాన రహదారి, వేణుగోపాలపురం రహదారులను కూడా కూటమి ప్రభుత్వం నిర్మించిందని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. కవులు, కళలు అంటూ ఇతర ప్రాంతాల్లో తిరుగున్న బుద్ధప్రసాద్‌కు ఇక్కడ ప్రజలు కష్టాలు ఎప్పటికీ అర్థం కావని విమర్శించారు. అవనిగడ్డలో డంపింగ్ యార్డుకు స్థలం మంజూరు కాకుండా అడ్డుపడిన నాటి కూటమి నేతలు నేడు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఇకనైనా నియోజకవర్గ ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలు చేయాలని హితవు పలికారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యన్నారాయణ, పార్టీ మండల కన్వీనర్ పరిశె మాధవరావు, రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి కొండవీటి వీరవెంకటనారాయణరావు, ఎస్సీసెల్ నియోజకవర్గం కన్వీనర్ వెన్నా ప్రసాద్, ఎంపీటీసీ బడే గంగాధరరావు, ఉప సర్పంచి ఇంకొల్లు మురళీకృష్ణ, పార్టీ మండల ఉపాధ్యాక్షుడు చిలకలపూడి ధర్మయ్య, జిల్లా నేతలు కోట పద్మావతి వరప్రసాద్, బడే సూర్యన్నారాయణ, చేబోయిన కృష్ణారావు, ఇంకొల్లు మురళీకృష్ణ, అధిక సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



పెద్దసంఖ్యలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలు, అభిమానులు

సలార్ దాదాకు పేర్ని కిట్టు అభినందనలు



సలార్ దాదా ను అభినందిస్తున్న పేర్ని కిట్టు, పార్టీ నాయకులు

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శిగా ఇటీవల నియమితులైన మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ సలార్ దాదాకు ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) సోమవారం అభినందనలు తెలిపారు. నగరంలోని ఇనుగుదురుపేట ఎంఆర్ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో సలార్ దాదాను పేర్ని కిట్టు, నగర మేయర్ చిటికెన వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్లు శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మి, మాజీ మేయర్ మోక వెంకటేశ్వరమ్మ, మాజీ డెప్యూటీ మేయర్లు తంటిపూడి కవిత, లంక సూరిబాబు, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు అభినందించారు. సలార్ దాదా రానున్న రోజుల్లో మరిన్ని పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు. సలార్ దాదా మాట్లాడుతూ తనకు ఈ అవకాశం ఇచ్చిన రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనరెడ్డికి, పదవి వచ్చేందుకు కృషి చేసిన మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని)లకు దాదా కృతజ్ఞతలు తెలిపారు.

నిషేధిత భూముల నుంచి తొలగించండి



డీఆర్వో చంద్రశేఖరరావుకు వినతిపత్రం అందజేస్తున్న పేర్ని కిట్టు, గ్రామస్తులు

చిలకలపూడి(మచిలీపట్నం): మచిలీపట్నం నార్త్ మండలం పొట్లపాలెం గ్రామ పంచాయతీ కొత్తపూడి గ్రామంలో ఎస్సీ కార్పొరేషన్ ద్వారా దళితులకు కొనుగోలు చేసి ఇచ్చిన భూములు నిషేధిత భూముల జాబితాలో చేర్చారని, వీటిని తొలగించాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) కోరారు. ఈ మేరకు డీఆర్వో కె.చంద్రశేఖరరావుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. కొత్తపూడి గ్రామంలో భూమి కొనుగోలు పథకం కింద ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నేరుగా రైతుల వద్ద నుంచి కొంత భూమిని కొనుగోలు చేసి లబ్ధిదారులకు ఇచ్చారన్నారు. ఈ సర్వే నంబర్లు 22ఏలో ఉన్నాయన్నారు. గతంలో ఈ భూములపై రుణాలు తీసుకుని వాటిని తిరిగి చెల్లించటం, లావా దేవీలు జరుపుకునే వారమన్నారు. పసుపు, కుంకుమల కింద ఈ భూములను అప్పగించటం కూడా జరిగిందన్నారు. అయితే ప్రస్తుతం వీటిని నిషేధిత భూముల జాబితాలో చేర్చిన కారణంగా కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఎటువంటి రుణాలు రాకపోవటంతో పాటు పసుపు, కుంకుమ పేరుతో ఇచ్చిన భూములు ఎందుకూ పనికి రావని అల్లుల్లు అత్తమామలపై ఒత్తిడి తెస్తున్నారన్నారు. ఇలా గ్రామంలో 38 మంది లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారని డీఆర్వోకు వివరించారు. జిల్లా యంత్రాంగం వెంటనే స్పందించి పట్టా భూమిగా మార్చి లబ్ధిదారులకు తోడ్పాటును అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పొట్లపాలెం సర్పంచ్ గాజుల నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు గడిదేశి రాజు, పిప్పళ్ల నాగబాబు, గ్రామస్తులు ఉన్నారు.

సాహెబ్‌కు పేర్ని కిట్టు నివాళి

మచిలీపట్నంటౌన్: అనారోగ్య కారణాలతో మృతి చెందిన జెడ్పీ రిటైర్డ్ ఉద్యోగి షేక్ కన్నం హుస్సేన్ (76)కు వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) సోమవారం నివాళులర్పించారు. అనారోగ్య కారణాలతో మృతి చెందిన హుస్సేన్ మృతదేహాన్ని ఈడేపల్లిలోని ఆయన నివాస గృహం వద్ద ఉంచగా పేర్ని కిట్టు సందర్శించి నివాళులు అర్పించారు. జిల్లా పరిషత్ ఉద్యోగిగా పనిచేసిన ఆయన ఎంతో నిబద్ధతతో విధులు నిర్వహించే వారని కిట్టు కొనియాడారు. ఆయన కుమారుడు ఐ న్యూస్ రిపోర్టర్ షరీఫ్‌ను, కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని ప్రకటించారు. నివాళులర్పించిన వారిలో 46వ డివిజన్ కార్పొరేటర్ భోగాదుల సాయిబాబు, కోఆప్షన్ సభ్యుడు బేతపూడి రవి, పార్టీ కార్యకర్తలు ఉన్నారు.

డ్రెయిన్‌లో తూటికాడ తొలగింపు

సాక్షి ఎఫెక్ట్

దేవరకోట(ఘంటసాల): ఘంటసాల మండలం దేవరకోట శివారు బిరుదుగడ్డ వద్ద గుండేరు డ్రెయిన్‌పై భారీగా పేరుకుపోయిన గుర్రపు డెక్క, తూటికాడ రైతులను నిండా ముంచింది అంటూ సాక్షి పత్రికలో సోమవారం వచ్చిన కథనానికి డ్రెయినేజీ శాఖ అధికారులు, ప్రాజెక్టు కమిటీ చైర్మన్, డీసీ మెంబర్లు, నేతలు స్పందించారు. ఈ సందర్భంగా దేవరకోట, బిరుదుగడ్డ, దాలిపర్రు, మాజేరు గ్రామాల పరిధిలోని గుండేరు డ్రెయిన్‌పై ఉన్న వంతెనల వద్ద పొక్లెయిన్లు ఏర్పాటు చేసి గుర్రపుడెక్క, తూటికాడ తొలగించే పనులు వేగవంతం చేశారు. ప్రాజెక్టు కమిటీ చైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, డ్రెయినేజీ శాఖ డీఈఈ జె.బాబూ నాయక్, ఏపీ రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వేమూరి రత్నగిరిరావు, మండలి వెంకట్రామ్, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, డ్రెయినేజీ క్వాలిటీ కంట్రోల్ డీఈఈ సీహెచ్ విశ్వకుమార్, ఏఈఈలు పి.చిరంజీవి, బి.ఇందిరా ప్రియదర్శిని, కె.అజయ్ కుమార్, టి.విజయ్ కుమార్, డీసీ వైస్ చైర్మన్ పరిశే చలపతిరావు, కూటమి నేతలు బండి నాగార్జున, తుమ్మలగుంట గోపాలకృష్ణ, బొర్రా అగ్గిరాముడు, రైతులు పరిశీలించారు.



దేవరకోట వద్ద గుండేరు డ్రెయిన్‌లో గుర్రపు డెక్క, తొలగిస్తున్న పొక్లెయిన్

ఫార్మసీ కాలేజీకి సావిత్రీబాయి పూలే పేరు పెట్టాలి

కోనేరుసెంటర్: కృష్ణా విశ్వవిద్యాలయంలో నూతనంగా నిర్మించిన ఫా ర్మసీ కాలేజీకి సావిత్రీబాయి పూలే పేరు పెట్టాలని ఉప కులపతి కూన రాంజీకి సోమవారం బీసీ సంక్షేమ సంఘం నాయకులు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల పరిధిలో ప్రభుత్వ ఫార్మసీ కాలేజీ కృష్ణా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయడం గర్వకారణం అన్నారు. వెనుకబడిన తరగతులకు చెందిన మహిళావిద్య కోసం ఎనలేని కృషి చేసి, మొదటి భారతీయ మహిళా ఉపాధ్యాయినిగా సావిత్రీబాయి పూలే ప్రఖ్యాతిగాంచారన్నారు. ఆమె కృషి ఫలితంగా ఈరోజు దాదాపు 60 నుంచి 70 శాతం మంది మహిళలు విద్యనభ్యసిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో ఫార్మసీ కాలేజీకి సావిత్రి బాయి పూలే నామకరణం చేయాలని ఉపకులపతిని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం, రాధాకృష్ణ, కొండేటి మోహన్, ఎం.రామరాజు, అన్సారి, భోగిరెడ్డి సుభాని, పి.సాంబశివ, జోగి శివ, జన్ను గోవిందు, చేబోయిన కోటేశ్వరరావు తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల ధర్నా



సీడీపీవో కార్యాలయం వద్ద ధర్నాలో అంగన్‌వాడీ కార్యకర్తలు

బంటుమిల్లి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేసిన యాప్‌ల కారణంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో నమోదైన లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో న్యాయం చేయలేకపోతున్నామని అంగన్‌వాడీ కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు మాట్లాడుతూ యాప్‌ల పేరుతో అంగన్‌వాడీ కార్యకర్తలపై వేధింపులు ఎక్కువ అయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. యాప్‌ల కారణంగా లబ్ధిదారులకు న్యాయం చేయలేకపోతున్నా మన్నారు. అనంతరం సీడీపీఓ ఎం.సముద్రవేణికి వినతి పత్రం అందజేశారు. ఈ ధర్నాలో సీఐటీయూ మండల కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు గోపిలక్ష్మి, కృష్ణవేణి, ప్రాజెక్టు పరిధిలోని పలు గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



బ్రాందీ షాపు వద్ద ఇరువర్గాల ఘర్షణ

పెడన: పట్టణంలోని తోటమూల సెంటరు సమీపంలో పీఆర్ వైన్స్ వద్ద ఆదివారం రాత్రి జరిగిన ఘర్షణపై పెడన పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సోమవారం 'సాక్షి'లో 'ఇరువర్గాల ఘర్షణ పలువురికి గాయాలు' అంటూ వార్త ప్రచురితమైన విషయం పాఠకులకు విధితమే. ఈ దాడిపై కేసు నమోదు కావడంతో పాటు పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణానికి చెందిన వరుదు దుర్గారావు అనే వ్యక్తి వైన్ షాపు వద్దకు వెళ్లి వైన్ తాగుతున్నాడు. అదే సమయంలో అక్కడే ఉన్న బొడ్డు కిరణ్, శ్రీను అనే యువకులు దుర్గారావును దుర్భాషలాడారు. ఈ విషయాన్ని ఇంటికి వెళ్లిన దుర్గారావు తనకుమారులైన సురేంద్ర, శ్రీనివాస్‌లకు చెప్పడంతో వారిద్దరు వైన్ షాపు వద్దకు వెళ్లి కిరణ్, శ్రీనులతో వాగ్వాదానికి దిగారు. కిరణ్, శ్రీనులు కర్రలతో దాడి చేయడంతో సురేంద్ర, శ్రీనివాస్‌లకు తీవ్ర గాయాలవగా 108లో మచిలీపట్నం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పెడన పోలీసులు ఆదివారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సిట్టింగ్‌కు అవకాశం ఇవ్వడమే గొడవకు కారణమా..?

అయితే ఈ వైన్‌షాపు వద్ద సిట్టింగ్ ఏ ర్పాటు చేయడంతో మద్యం కొనుగోలు చేసిన వారు ఇక్కడే తాగి ఇళ్లకు వెళ్తుండటం పట్ల ఇటు పోలీసులు, అటు ఎక్సైజ్ వారు కూడా ఎటువంటి అభ్యంతరం వ్య క్తం చేయకపోవడం గమనార్హం. వాస్తవంగా నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్‌కు అవకాశం ఇవ్వడంవల్లే ఇలా గొడవలు జ రుగుతున్నాయనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా పోలీసులు, ఎక్సై జ్ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా సిట్టింగ్‌లు ఏర్పాటు చేయడాన్ని నిలువరించాలని పలువురు కోరుతున్నారు.



మాజీ కౌన్సిలర్ రాజేశ్వరమ్మ మృతి



రాజేశ్వరమ్మ

మచిలీపట్నం టౌన్: మున్సిపల్ మాజీ కౌన్సిలర్ ఈడే రాజేశ్వరమ్మ (77) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. స్థానిక భాస్కరపురంలోని ఆమె నివాసం వద్ద ఈ తెల్లవారుజామున ఆమె మృతి చెందారు. 1995 నుంచి 2000 సంవత్సరాల మధ్య ఆమె మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు. రాజేశ్వరమ్మకు భర్త మోహనరావు, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె నివాసం వద్ద ఉన్న మృతదేహాన్ని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) ఆ పార్టీ జిల్లా కోశాధికారి బందెల థామస్ నోబుల్, మాజీ కౌన్సిలర్, పార్టీ నగర ఉపాధ్యక్షుడు గూడవల్లి నాగరాజు, తదితర నాయకులు సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు.

రాజ్యలక్ష్మి అమ్మవారికి ఆషాఢ సారె



మచిలీపట్నంటౌన్: నగరంలోని రాబర్ట్‌సన్‌పేటలోని రంగనాయక స్వామి ఆలయంలో కొలువైన రాజ్యలక్ష్మి అమ్మవారికి మహిళా భక్తులు సోమవారం ఆషాఢ సారెను అందజేశారు. భక్తులు పసుపు, కుంకుమలు, చీర, జాకెట్, పిండి వంటలు, స్వీట్లు, పండ్లు, పువ్వులు తదితరాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు, దీపాలంకరణ, పారాయణ వంటి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఆలయ సిబ్బంది తీర్థ ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమాన్ని ఆలయ కార్యనిర్వహణ అధికారి మాగపాటి సత్యప్రసాద్‌బాబు పర్యవేక్షించారు.

వైభవంగా శాకంబరి ఉత్సవం



భావదేవరపల్లి(నాగాయలంక): గ్రామంలోని శ్రీఅన్నపూర్ణదేవి సమేత శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా శాకంబరీ ఉత్సవ పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆకెళ్ళ దేవనాథన్ శర్మ తొలుత అమ్మవారికి, విశ్వేశ్వర స్వామికి అభిషేకాలు జరిపారు. అనంతరం సంప్రదాయ రీతిలో శాకంబరి పూజను శాస్త్రోక్తంగా జరపగా ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త పూషడపు నిరంజనరావు, శివసత్యవతి దంపతులు పీటలపై కూర్చున్నారు. అమ్మవారిని 50కిలోల కూరగాయలు, ఆకుకూరలు, పండ్లతో అలంకరించారు. శాకంబరి అలంకరణలో అన్నపూర్ణదేవిని భక్తులు దర్శించుకున్నారు.

ఉద్యోగులకు సన్మానం

ఘంటసాల: ఘంటసాల 1, 2 గ్రామ సచివాలయాల్లో పని చేస్తూ బదిలీపై వెళ్లిన ఉద్యోగులకు పంచాయతీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. సర్పంచ్ బాణావతు వెంకటేశ్వరమ్మ, పంచాయతీ కార్యదర్శి తాడేపల్లి జయలక్ష్మి, స్వచ్ఛ ఘంటసాల కన్వీనర్ గొర్రెపాటి సురేష్, వార్డు సభ్యుడు దిరిశం సుధీర్ లు దుశ్శాలువాలతో సత్కరించి పూలబొకేలు అందించారు. ఈ కార్యక్రమంలో ఘంటసాల 1, 2 సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.



